క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

మహబూబ్‌నగర్ రూరల్: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన మదాసీ/మదారి కుర్వ విద్యార్థులకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధన్వాడ రాములు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాలువతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు శివన్న, వేణుగోపాల్, చింతలయ్య, రాములు, శ్రద్ధానంద్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సేవలను మరిచిన అధిష్టానం



భూత్పూర్: ఏళ్ల తరబడి టీపీసీసీ సంయుక్త కార్యదర్శి కాటం ప్రదీప్ కుమార్ గౌడ్ చేసిన సేవలను అధిష్టానం మరిచిందని.. టికెట్ ఇవ్వకపోవడం సరికాదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవర్దన్ గౌడ్ విమర్శించారు. ఆదివారం భూత్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. నిర్ణయంపై పునరాలోచించాలని అన్నారు. నాయకులు ఫిసియోద్దీన్, అబ్బుబాకర్ సిద్దీఖీ, జైదు శ్రీను ముదిరాజ్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికలో అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకుంటే బాగుండేదని కాంగ్రెస్ నాయకులు బాలరాజు, ఖాజామైనోద్దీన్ అన్నారు. అడ్డాకులలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. అసమ్మతిని చల్లార్చి అందరితో మాట్లాడాలని, లేకపోతే పార్టీ దెబ్బతినే అవకాశం ఉందన్నారు. నియోజకవర్గంలో బీసీలకు సరైన ప్రాధాన్యత లేదని పేర్కొన్నారు. కొత్త శ్రీను, హన్మంతు, నవీన్, నిరంజన్, వెంకటయ్య తదితరులు ఉన్నారు. మూసాపేటలో నగేష్ ఆధ్వర్యంలో నాయకులు సమావేశమై బీసీ అభ్యర్థికే టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

అడ్డాకుల: మండలంలోని తిమ్మాయిపల్లి తండాకు చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నివాసంలో కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూత్పూర్: మున్సిపాలిటీలోని 6వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన 35 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన వారు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి నివాసంలో ఆదివారం కౌన్సిలర్ రామకృష్ణ, ముడా డైరెక్టర్ మూస సాయిలు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.

ప్రాజెక్టులు రాకుండా చేసింది కేసీఆరే



గండీడ్: పరిగి ప్రాంతానికి ప్రాజెక్టులు రాకుండా చేసి ఏడారిగా మార్చింది కేసీఆరే అని.. మాటలతో ప్రజలను మోసం చేశారని పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని రెడ్డిపల్లి, చెన్నాయిపల్లి, జంగంరెడ్డిపల్లి, గండీడ్, అంచన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రాజెక్టుల ఏర్పాటుకు శ్రీకారం చుడితే వాటిని అణగదొక్కి ఈ ప్రాంతానికి ఒక్క చుక్క నీరు రాకుండా కేసీఆర్ చేశారని ధ్వజమెత్తారు. దీంతో పాటు చార్మినార్ జోన్ నుంచి తొలగించి జోగుళాంబ జోన్‌లో చేర్పించి ఈ ప్రాంత వాసులకు ఉద్యోగాలు రాకుండా చేసిన ఘనత వారిదేనన్నారు. రానున్నది కాంగ్రెస్సే అని వివరించారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరారు. మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబాభవాని మందిర్‌లో అన్నదానం

నారాయణపేట రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని పట్టణంలోని అంబాభవాని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం చేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రధాన దారిపైకి 'భగీరథ' నీరు

- వాటర్ ట్యాంకు వద్ద మొరాయించిన వాల్వ్
- 15 నిమిషాల్లోనే బాగు చేసిన మున్సిపల్ సిబ్బంది



ఇండస్ట్రియల్ ఏరియాలో..



మెట్టుగడ్డ నుంచి పరిమళగిరి ఆర్చ్ వరకు మెయిన్‌రోడ్డుపై పారుతున్న తాగునీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు నిండి ఓవర్ ఫ్లో కావడంతో అర కిలోమీటరు మేర ప్రధాన రోడ్డుపై మిషన్ భగీరథ నీరు వృథాగా పారింది. జడ్చర్ల నుంచి మెయిన్ పైపులైన్ ద్వారా తాగునీటిని పంపింగ్ చేయగా ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు ఇక్కడి వన్ ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకు నిండింది. అయితే 15 నిమిషాల పాటు వాల్వ్ మొరాయించడంతో పూర్తిగా బంద్ కాలేదు. అనంతరం ఎలాగోలా మున్సిపల్ సిబ్బంది దానిని బాగు చేశారు. అప్పటికే ఇండస్ట్రియల్ ఏరియా మొదలుకుని జాతీయ రహదారి (ఎన్‌హెచ్–167) పై మెట్టుగడ్డ నుంచి పరిమళగిరి ఆర్చ్ వరకు తాగునీరు ఏరులై పారడంతో వాహనాదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై డీఈఈ బెంజమిన్‌ను వివరణ కోరగా కొద్దిసేపు ట్యాంకు వద్ద వాల్వ్ సరిగా పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ తర్వాత దానిని బాగు చేయించి తాగునీరు బయటకు పోకుండా చూశామన్నారు.

అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తే చాలు



పార్టీలో చేరినవారితో మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తే చాలని... రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించడం ఖాయమని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం ఫాం హౌస్‌లో బీజేపీ జిల్లా మైనార్టీ సెల్‌నాయకులు బీఆర్‌ఎస్‌పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తోందని, కులం, మతం పేరిట సమాజాన్ని విడగొట్టడంలో బీజేపీ ముందుంటుందని అన్నారు. బీఆర్‌ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో మాల మహానాడు నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లోచేరారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. అదేవిధంగా పద్మశాలి సమాజ అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేశారని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం పద్మశాలి మేళాలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్స్ అసోసియేషన్ ఎన్నిక

నవాబుపేట: మండల పరిధిలోని దేపల్లిలో ఆదివారం డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అఖీల్, ప్రధానకార్యదర్శిగా రాజు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

చిన్నరాజమూర్‌లో పర్ణికారెడ్డి పూజలు



దేవరకద్ర: నారాయణపేట కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తమ ఇలవేల్పుగా కొలిచే ఆంజన్నకు పర్ణికారెడ్డి మొక్కులు తీర్చుకుని ఎన్నికల బరిలోకి బయలుదేరారు. గ్రామానికి వచ్చిన ఆమెకు సర్పంచ్ జయమ్మ స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఓబీసీ కన్వీనర్ గోపాల్, ఉప సర్పంచ్ మైబు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే పథకాల అమలు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం 20వ వార్డు మర్లు కిషన్‌నాయక్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్‌కు ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, అధికార ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అఖ్తర్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడ: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. ప్రలోభాలకు గురిచేసినా పాలమూరులో కాంగ్రెస్‌దే విజయమని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల నాయకులు పార్టీలో చేరారు. అనంతరం మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయానికి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

అధ్యక్షుడిగా ఫారుఖ్

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు ఎండీ ఫారూఖ్ బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ అధ్యక్షుడు వీర బ్రహ్మచారి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



మాట్లాడుతున్న రాజేశ్వర్‌గౌడ్

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాజ్‌కుమార్, బి.శేఖర్, శమీం, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని కొత్తబస్టాండ్ ప్రాంతంలో ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు గడప గడపకు ప్రచారం నిర్వహించారు. అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు బాల్‌రాజు, పురేందర్, గోపాల్, రామ్‌రమేశ్ తదితరులు పాల్గొన్నారు. అజిలాపూర్‌లోనూ ప్రచారం కొనసాగింది.

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ ఆదివారం మండల పరిధిలోని ఫతేపూర్, తువ్వగడ్డ తండాల్లో ఎన్నికల ప్రచారంపై బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేయడం కోసం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ముడా డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌లు అలివేలు, పుర్యానాయక్, కె.శంకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు, నాయకులు పి.రవీందర్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జంప్ జిలానీలు

నవాబుపేట: మండలంలో పార్టీలలో చేరికలు ఊపందుకున్నాయి. దీంతో రోజూ జంప్ జిలానీలు హంగామా చేస్తున్నారు. ఆదివారం రుద్రారం యువకులు అనిరుధ్‌రెడ్డి, మల్లురవిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే కొండాపూర్‌కు చెందిన కొందరు కాంగ్రెస్‌ను వీడి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రేకుల చౌడాపూర్‌కు చెందిన బీజేపీ కిసాన్‌మోర్చా కార్యదర్శి బాలస్వామి ఆదివారం రాజీనామా చేశారు. వచ్చే నెల 1న బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నారాయణపేట రూరల్: ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ధృవపేటలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అమ్మాయిలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొని పలు దైవభక్తి, సాంప్రదాయ నృత్యాలు చేశారు. పోటాపోటీగా డ్యాన్సులు చేసిన చిన్నారులకు సమాజం పెద్దలు బహుమతులు అందించారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం

రాజాపూర్: కాంగ్రెస్ టికెట్ కేటాయించిన నేపథ్యంలో ఆదివారం సొంత గ్రామం రంగారెడ్డిగూడకు వచ్చిన అనిరుధ్‌రెడ్డికి అభిమానులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామ స్టేజీవద్ద అంబేడ్కర్ విగ్రహానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవితో కలిసి ఆయన పూలమాల వేశారు. అనంతరం లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో పూజలు చేశారు. తన నివాసంలో తల్లి దండ్రులు దిలీప్‌రెడ్డి, శశికళారెడ్డిల ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ కలిసి పనిచేసి అనిరుధ్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. ఈ క్రమంలోనే రుద్రారం, కొండాపూర్, లోకిరేవు నాయకులు పార్టీలో చేరారు.

మిడ్జిల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మల్లురవి మాట్లాడుతూ మునిగే పడవలో ఎక్కిన నాయకుల గురించి కార్యకర్తలు పట్టించుకోవద్దని అన్నారు. పార్టీ విజయం ఖాయమన్నారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరారు. టీపీసీసీ కార్యదర్శి రబ్బాని, మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో అనిరుధ్‌రెడ్డి, మల్లురవి

అప్రకటిత విద్యుత్ కోతలు

హన్వాడ: మండల కేంద్రంలో విద్యుత్ కోతలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. అప్రకటిత విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన లైన్‌లతో సమస్య తలెత్తుతున్నట్లు విద్యుత్ సిబ్బంది పేర్కొంటున్నారు. కాగా గత కొద్ది రోజులుగా విద్యుత్ లైన్‌లలో సమస్య అంటూ అధికారులు గంటల తరబడి కోతలు విధిస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం మూలంగా టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్‌లు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. అదేవిధంగా ఇంటర్‌నెట్ షాపులు ఇతర వ్యాపార సముదాయాల్లో విద్యుత్ సమస్యతో అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.



హన్వాడలో విద్యుత్ లైన్‌ను సరిచేస్తున్న సిబ్బంది

ఉత్సాహంగా క్రీడాకారుల ఎంపికలు



ఎంపికల్లో పాల్గొన్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని స్టేడియంలో ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, అండర్–17 జిల్లాస్థాయి తైక్వాండో బాల, బాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటాలని కోరారు. అండర్–14 విభాగానికి 15 మంది, అండర్–17 విభాగంకు 9 మంది విద్యార్థులు త్వరలో గద్వాలలో జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు, ఉపాధ్యక్షులు సాయిలు, కోచ్‌లు శంకర్, రాజేష్, వెంకటేశ్, సాయికీర్తన, వెంకటకృష్ణమ నాయుడు, షఫీ, స్ఫూర్తి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు

బాలానగర్: మండలంలో కేంద్ర బలగాల కవాతు ఆదివారం నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఉడిత్యాల, నేరళ్లపల్లి, వీరన్నపల్లి గ్రామాల్లో ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోవడానికి పోలీసులతోపాటు కేంద్ర బలగాలు సిద్ధంగా ఉన్నాయని, సమస్య వస్తే ఏ క్షణం, ఏ ప్రాంతానికైనా వస్తామని తెలపడానికి కవాతు నిర్వహించినట్లు తెలిపారు.



ఉడిత్యాలలో కేంద్రబలగాల కవాతు

రైతులు దళారులను నమ్మొద్దు



నవాబుపేటలో సమావేశంలో పాల్గొన్న పాలకవర్గం సభ్యులు

నవాబుపేట: రైతులు దళారులను నమ్మొద్దని మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య అన్నారు. రైతులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పాలకవర్గం సమావేశంలో మాట్లాడారు. ధాన్యం నాణ్యత ఆధారంగా ధర ఇవ్వాలని, రైతులకు న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా వ్యాపారులు టెండర్‌ను సమయం ప్రకారం వేయాలన్నారు. రాత్రి వరకు టెండర్లు వేసి రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. రైతులు సైతం తొందరపడి ధాన్యం విక్రయించ కుండా గిట్టుబాటు ధరకోసం వేచి చూడాలన్నారు. ప్రతిరైతుకు తాము పండించిన పంటకు నష్టం రాకుండా చేయాలని అన్నారు. టెండర్లకు సంబంధించి వారంలో రెండు రోజులు ఉండగా, ధాన్యం అధికంగా వచ్చినప్పుడు మరో రోజు సైతం టెండర్లు వేసుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. పాలకవర్గం సభ్యులు రవి, శ్రీధర్, కృష్ణయ్య, ప్రేమ్‌సుధాకర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చండి

మహబూబ్‌నగర్ రూరల్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చుతామని మేనిఫెస్టోలో పెట్టి అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే తమ మద్దతు ఉంటుందని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి, రాష్ట్ర కో–కన్వీనర్ బండలయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సమితి యువజన విభాగం అధ్యక్షుడు శివకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షుడిగా నాగన్న, గౌరవ అధ్యక్షుడిగా శివన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా చాకలి రాజు, ప్రధాన కార్యదర్శిగా సతీష్, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో యువజన విభాగం జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్, గోవిందమ్మ, లలిత, నాగలక్ష్మి, అనిత, నాగమణి, నాగరాజు, మైబు, కుమార్, నర్సిములు, యాదయ్య, అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

హైవేపైనే 'ఎక్స్‌ప్రెస్' సేవలు

- అడ్డాకుల బస్టాండ్‌లోకి రాని బస్సులు
- జాతీయ రహదారిపైనే ప్రయాణికులను ఎక్కించుకుంటున్న డ్రైవర్లు



అడ్డాకుల వద్ద రహదారి పైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అడ్డాకుల: మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఉన్నప్పటికీ కొన్ని డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదు. గద్వాల డిపోకు చెందిన హైదరాబాద్ వెళ్లే బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. హైవే పైనే ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్నాయి. అడ్డాకులకు బస్సు టికెట్ ఇస్తూ ఇక్కడ బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక వనపర్తి డిపోకు చెందిన బస్సులు కర్నూల్ నుంచి హైదరాబాద్ వెళ్లే సమయంలో అడ్డాకుల బస్టాండ్‌లోకి రావడం లేదు. దీనివల్ల హైదరాబాద్ వెళ్లాలనుకునే ప్రయాణికులు ప్రధాన రహదారిపై బస్సుల కోసం వేచి చూడాల్సి వస్తోంది. కేవలం గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులు మాత్రమే ఆర్టీసీ బస్టాండ్‌లోకి వస్తున్నాయి. వనపర్తి డిపో నుంచి కొత్తకోట మీదుగా హైదరాబాద్ వెళ్లే బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి వచ్చి వెళ్తున్నాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను అడ్డాకుల బస్టాండ్‌లోకి వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూసాపేట వద్ద నిలపరా..?

మూసాపేట మండల కేంద్రంగా ఏర్పడినా వనపర్తి, గద్వాల డిపోలకు చెందిన బస్సులు మూసాపేట వద్ద నిలపడం లేదు. హైదరాబాద్, కర్నూల్ వైపు వెళ్లే ప్రయాణికులు రహదారిపై బస్సుల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే చాలామంది భూత్పూర్ వరకు వెళ్లి అక్కడ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో వెళ్తున్నారు. మూసాపేటతో పాటు నిజాలాపూర్, సంకలమద్ది, వేముల, దాసర్‌పల్లి, నందిపేట, మహ్మదుస్సేన్‌పల్లి గ్రామాలకు చెందిన ప్రయాణికులు హైదరాబాద్ వెళ్లడానికి మూసాపేటకే వస్తారు. ఈక్రమంలో రహదారిపై గద్వాల, వనపర్తి డిపోలకు చెందిన అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు మూసాపేట వద్ద నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మూసాపేట వద్ద ఎక్స్‌ప్రెస్‌లు నిలపాలి



మూసాపేట వద్ద జాతీయ రహదారిపై గద్వాల, వనపర్తి డిపోకు చెందిన హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపడం లేదు. చాలా మంది భూత్పూర్ వెళ్లి అక్కడ హైదరాబాద్ బస్సుల్లో వెళ్లిపోతున్నారు. హైదరాబాద్, కర్నూల్ వెళ్లే అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను మూసాపేట వద్ద నిలపాలి.

–షేక్ పాష, మూసాపేట

బస్టాండ్‌లోకి రావాలి



గద్వాల డిపోకు చెందిన హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు అడ్డాకుల బస్టాండ్‌లోకి రావడం లేదు. దీంతో హైదరాబాద్, కర్నూల్ వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం హైవేపై నిలబడుతున్నారు. దీనివల్ల ప్రయాణికులకు ప్రమాదం కూడా పొంచి ఉంది.

–బాలరాజు, అడ్డాకుల